# పండితమ్మన్యులు

పశ్చిమ గోదావరి జిల్లాలో ఒకచోట ఉపాధ్యాయ పండితులంతా కలిసి- తమ స్కేళ్ళు, ఎగుడుదిగుళ్ళు, చర్చించి తమ బాగోగులు ప్రభుత్వానికి తెలుపుకోడానికి ఒక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దానికి నాటి విద్యాశాఖాధికారిని అధ్యక్షులుగా ఆహ్వానించారు.

విద్యాశాఖాధికారిగారు తమ పరివారంతో సభకు దయచేసి అధ్యక్షత వహించారు.

కన్వీనరు సమావేశ ఉద్దేశాలు తెలిపి కూర్చున్నాడు. విద్యాశాఖాధికారి పండితుల మీద గౌరవం, సానుభూతికలవాడు. అధ్యక్షోపన్యాసం ప్రారంభిస్తూ "పండితంమన్యులారా ! మీ కష్టనిష్ఠురాలు నాకు తెలుసు." అన్నాడు.

'పండితంమన్యులు' అంటే 'పండితులం అనుకునేవారు' కాని పండితులు కారు. సభలో వాళ్ళంతా 'పండితులు' గనక, ఎంత అణుచుకున్నా ఆగక పక్కున నవ్వేశారు. అధికారి నివ్వెరబోయాడు. తన మాటలో ఏదో తిరకాసు వుందని గ్రహించాడు. గడుసువాడు. వెలితి కన

పడకుండా, వెలవెల బోకుండా, నిలదొక్కుకుని తొలిపలుకులు పూర్తి చేసినా - తనవల్ల సహాయం పొందదలచినవారు అలా నవ్వడమేనా? అని లోపల్లోపల మండిపడ్డాడు. వీళ్ళ భరతం పట్టాలనుకున్నాడు. పర్యవసానం ఏమయిందో తెలియదుగాని మొత్తానికి కది ఆధ్యాత్మికోపన్యాసం అయింది.

లోకంలో మనిషికి తనకు రాని భాషమీద వల్లమాలిన మోజు. అది ఎక్కడ బెడిసి కొడుతుందో తెలియదు.

హైస్కూల్లో ఏడాదికొకసారి డి.ఇ.ఓ ఇన్‌స్పెక్షన్ జరుగుతూ ఉంటుంది. నేను చేరిన కొత్తరోజుల్లో డి.ఇ.ఓ.ను దొరగారు అనేవారు. ఆ దొరగారితో "తన వెంటన్ సిరి, లచ్చి వెంట నవరోధ(వ్రాత)మున్" అన్నట్టు ఆ రేంజిస్కూళ్ళ ఇన్‌స్పెక్టర్లుకూడా వుంటారు. దొరగారు పెద్ద క్లాసుల్లో పెద్ద సబ్జెక్టులు ఇంగ్లీషు వగైరా చూస్తూవుంటే 'చిల్లరదేవుళ్ళు' చిన్న సబ్జెక్టులు - తెలుగు వగైరా చూస్తూవుంటారు.

అందరికీ లోకువైనది తెలుగు - ఎవరైనా చూడవచ్చు. ఏమైనా అనవచ్చు.

స్కూల్లో ఒక మూల గదిలో వుంటుంది సంస్కృతం క్లాసు. ఇన్‌స్పెక్షన్ రోజుల్లోనైనా అటువైపు ఎవ్వరూ వెళ్ళరు. ఆ గదిలోంచి భూతవైద్యుడి మంత్రాల్లా, లట్, లిట్, లుట్, ల్రుట్ అని వినపడుతూ ఉంటే ఎవరికైనా తలనొప్పి. కాని- నూటికి కోటికి ఏ ఆదినారాయణ వంటి డి.ఇ.ఓ.లో వచ్చి సంస్కృతం పాఠాలుకూడా విని ఆనందించడం కద్దు.

ఒకసారి ఇన్‌స్పెక్షన్ జరుగుతోంది. రెండురోజులు నిర్విరామంగా పర్యవేక్షణ సాగించారు.

మూడవరోజు తుదిరోజు.

ఇన్‌స్పెక్షన్ ముగింపుకు వచ్చింది.

ఆ సాయంత్రం పర్యవేక్షకుల నివేదికలు, దొరగారి సూచనలు, తుదిని టీపార్టీ!

దొరగారివెంట వచ్చిన పి.పి. శాస్త్రిగారు సీనియర్ ఇన్‌స్పెక్టర్. వారికి హఠాత్తుగా సంస్కృతం క్లాసు చూడాలనిపించింది. నేను క్లాసులో వుండగా వచ్చారు.

అది స్కూల్‌ఫైనల్ సంస్కృతం.

ప్రత్యుత్థానాదులయాయి.

ఆయనకు తెలుగులో బాగా ప్రవేశం ఉందని నమ్మకం. ఆ మాత్రం సంస్కృతం పరీక్షించలేమా ? అని ధీమా-

ఇన్‌స్పెక్షన్‌కు వచ్చినవారు టీచరును పాఠం చెప్పమనవచ్చు. లేక పాత పాఠాలలోనే ప్రశ్నలు వెయ్యమనవచ్చు.

అయితే-టీచరు వేసిన ప్రశ్నలకు విద్యార్థులు చెప్పిన ఆన్సర్లు రైటో, తప్పో తెలియాలి. లేకపోతే - టీచరు మర్యాదకు ఊరుకున్నా విద్యార్థులే నవ్వుతారు.

ఇన్‌స్పెక్టరుగారు ప్రశ్నలు వెయ్యమన్నారు. పాఠ్యగ్రంథంలో కంఠస్థం చెయ్యవలసిన శ్లోకాలు ఉంటాయి. అందులో రెండు ఇద్దరిచేత చదివించి అర్థం చెప్పమన్నాను. చెప్పారు. ఆ నీతులు తెలిసినవే గనక పేచీలేకుండా నడిచిపోయింది. ఆ క్లాసులో ఒక ఆడపిల్ల వుంది. ఆమెను

ప్రశ్నించమన్నారు కొన్ని శబ్దాలకు విభక్తులు, కొన్ని మాటలకు అర్థాలు అడిగాను. కొన్ని తప్పులు చెప్పినా నేను మాట్లాడలేదు. ఇన్ స్పెక్టరుగారు జవాబులకు సంతోషించారు. "వీళ్ళకు వ్యాకరణం వుందా ?" అన్నారు.

"ఉంది" అన్నాను.

ఆయన చట్టున ఏదీ జ్ఞాపకంరాక వాళ్ళు చదివిన శ్లోకంలో ఒక ముక్క తీసుకుని "ఇది ఏ సమాసం ? విగ్రహం ఏమిటి?" అని యింక తానే రంగంలోకి దిగారు. సరే యిక ముగియవచ్చింది గదా అని సంతోషించాను.

"విగ్రహం చెప్పగలరు - సమాసాలు సిలబస్‌లో లేవు. అయినా వాళ్ళ పరిజ్ఞానానికి చెబుతూ ఉంటాను." అన్నాను.

"మంచిది-సిలబస్‌లో లేకపోతేనేం ? చెప్పాలి" అన్నారు.

"చిత్తం."

లేచారు. ఆడపిల్లను "అమ్మాయీ, సమాసానికీ, సమాసోక్తికీ తేడా ఏమిటి : ఆ మాటకు సమాసం చెప్పావుసరే- సమాసోక్తికూడా చెప్పు" అన్నారు. పిల్ల తెల్లబోయింది.

నేనన్నాను నవ్వుతూ- "ఇన్ స్పెక్టరుగారు మిమ్మల్ని పరీక్షిస్తున్నారు. సమాసోక్తి అలంకారం. అది సమాసాల్లో వుండదు, అని వారికి తెలుసు అన్నాను-" పిల్ల వేపు తిరిగి-

ఇన్ స్పెక్టరుగారు ఠీవిగా లేచి వెళ్ళిపోయారు మీటింగుకు.